# నిరుద్యోగి సాహసం

"సుందర్రావు గారిల్లిదేనా అండి ........"

మాటలు తడబడుతూ, వెర్రి మొహం వేసుకుని, కళ్ళార్పకుండా నిలబడ్డాడు ఆనందం. ఎదురుగ్గా నిలబడ్డ ఆ యువతి మొహం చూస్తుంటే, ఆనందానికి దడా, ఆయాసం యెక్కువయినాయి. మొహం క్షణాల్లోకంది పోయింది. గుటకలువేస్తూ గతుక్కుమన్నాడు.

'అహా, సుందర్రావుగారి,' అని మళ్ళీ అందామనుకుని, యేమిటా రిపిటిషన్, అని తనలో తాను సమాధానపడి, యిదెవరిల్లండీ అంటే సరిపోదా అనుకుని అదీ మనస్సుకు నచ్చక, నేను గుంటూర్నుంచి వస్తున్నాను, అని ధీమాగా తన విషయమే ముందుగా చెప్పటానికి నిశ్చయించు కున్నాడు, ఆనందం.

ఇంత అవస్థపడుతూ, మధనపడుతూ తబ్బిబ్బులయి పోతున్నా కూడా, ఆమె మాత్రం ఎల్లోరా సుందరిలాగ, చలనం లేకుండా అట్లాగే నిలబడేవున్నది. బట్టల కొట్టులో పెట్టిన బొమ్మలా. నిజంగా మనిషేనా,

అనే సందేహం, ఒక్కక్షణం మెరుపులాగ, ఆనందాన్ని ముందుకూ వెనక్కూ వూపేసి, మళ్ళా రెండుకాళ్ళమీద నిలబట్టేసింది. భూమి మీద పాదాన్ని గట్టిగా మోపేసి ధైర్యంగా, "నన్ను ఆనందం అంటారు" అని కళ్ళార్పుతూ పెదిమలు వెడల్పు, చేస్తూ అక్షరాల్ని సాగదీశాడు.

'అబ్బ, మగవాళ్ళల్లో కూడా యింతనాజూకు వాళ్ళుంటారు గామాలు' అనుకుని వసంత, బుగ్గసొట్ట బైటపెట్టేసింది. బనీనుతో సహా, బుష్షర్ట్ కూడా, ఆనందం హృదయాన్ని గట్టిగా అద్దుకున్నాయి. రుమాలుతో, నుదురుమీద తడిని కసిగా అద్దేసుకుని, "సుందర్రావు గారున్నారా యింట్లో" అని ఆపళంగా ఒక్కగుక్కలో అనేశాడు.

'ఊఁ' అన్నట్టు తలవూపేసి యిట్టే గిర్రున లోపలికి వెళ్ళిపోయింది వసంత. ఇంకా కనురెప్పలు మూతపడక మునుపే యిట్లోంచి రివ్వున ఓ పెద్దకుక్క భవ్ మని అరుపును ముందుకు పారేసి, చివాలున వచ్చిపడింది.

ఆనందం, "చచ్చారోయ్, బాబోయ్" అని ఓ పెద్దకేక పెట్టటానికి పెనుగులాడి చివ్వరకు నోటమాట లేకుండా ఉన్న వాడున్నట్టుగా కూలి పోయాడు.

'జాకీ' సన్నని గొంతుక యింట్లోంచి కుక్కకు మాత్రమే విని పించింది. చెవులు క్రిందకు జారుస్తూ నాలిక పొడుగ్గా, సాగించి అటూ యిటూ ఆ వరండాలో పచార్లు చేస్తుంటే, తనచుట్టూ ప్రదక్షిణం చేస్తు న్నట్లుగానే, ఆనందం తన కళ్ళను రెంటిని ఆ కుక్క వైపుకే తిప్పుతూ ఆయాస పడుతున్నాడు.

'జాకీ యేం చెయ్యదండి ....' అంటూ కుక్కతలను నిమురుతూ వుంటే, కుక్క తన పొడుగాటి నాలుకతో వసంత వంటిని నాకుతోంది.

'ఇంకేం చెయ్యాలి, నా ప్రాణాలు తియ్య లేదంటావ్ అంతేగా అని'

గట్టిగా అరవాలనిపించినా కూడా, ఆనందం తమాయించుకుని, 'అవును ఏంచెయ్యదు' అని సణిగాడు.

'డాడి యిప్పుడే వస్తారు. ఇలా కూర్చోండి ....' అని ఓ పెద్ద సోఫా సెట్టును చూపించింది.

ఉన్నచోటునుంచి లేవటం యెట్లా! ఓమూల ఆ కుక్క రెండు కళ్ళూ తనమీదే వున్నాయే, అప్పుడప్పుడు భవ్‌మని గుండె అదరకొట్టే స్తోందే, ఓ వేళ సాహసించి లేచినా, ఆసోఫాసెట్టులో కూర్చోటం యెట్లా! ఆ పక్కనేగా కుక్క నిటారుగా నిలిబడివుంది. అని యింకా ఎన్ని ఆలో చనలు వచ్చినా, లేవటం తప్పనిసరే అయింది. ఆనందం లేచి నిలబడ్డాడో లేదో అప్పుడే ఆ కుక్క భవ్ మంది, తనను మరిచి పోతాడేమో అన్నట్లు.

'జాకీ యేం చెయ్యదు...' అని తనలో తానే అనుకుని, ముందుకు వచ్చి, సోఫాలో కూలబడ్డాడు. ఆ క్షణంలో అతని ఆలోచనలన్నీ, తన ప్రాణరక్షణ మీదే కేంద్రీకరింప బడ్డాయి గాని, ఉద్యోగం మీద మాత్రం కాదు. ఆ 'జాకీ' క్షణం ఒక చోట నిలబడదు. ఆనందం ఎదురుగా వచ్చేసి యిట్టే బుష్‌షర్టు కాలుతో లాగుతోంది. నోటితో, పాంట్‌ను గుంజుతోంది. ఇప్పటికీ కూడా 'జాకీ యేమిచెయ్యదు' అనే అభిప్రాయమే ఆమెకుంది. ఆమెవంక చూస్తే మాత్రం ఆమాటే మళ్ళీ అంటుందని, తల వంచుకుని, ఆనందం ధైర్యాన్ని ప్రదర్శించటానికి ప్రయత్నం చేస్తున్నాడు. తనను ఒట్టి పిరికి వాడని అనుకుంటుందేమో అని మొదట్లో బాధపడ్డా అనుకుంటే అనుకుంటుందిలే అని మళ్ళీ ఒప్పేసు కున్నాడు.

ఇంక కొంచెం సేపు ఆ కుక్క తనను వేధించటం సాగిస్తే, ఏం చేసేవాడో యేమో గాని, యీలోగానే సుందర్రావు వరండాలోకి రానే వచ్చాడు.

'జాకీ గెటిన్ ... ఊఁ ....' అంటూ కుక్క వీపుమీద గట్టిగానే చరిచాడు, సుందర్రావు.

సుందర్రావు సహకారానికి ఆనందం లోపల లోపల యెంతగానో సంతోషించాడు.

'ఊఁ ....' కనుబొమ్మలు పైకి ఎగరేస్తూ, ఆనందం వైపు చూశాడు. ఎవరు నువ్వు, ఏమిటీ కథ అన్నట్లు.

ఆనందం ధైర్యాన్ని పుంజుకుని, లేచి నిలబడ్డాడు. రెండుచేతులూ కలిపి నమస్కారం చేశాడు.

తలుపు ప్రక్కన నిలబడ్డ వసంత ఫక్కున నవ్వింది. 'దట్సాల్ రైట్ ....' గద్దించాడు. సుందర్రావు, ఆనందం మొహంలోకి చిరాకుగా చూస్తూ.

'మీ అమ్మాయి నవ్వుతుంటే, నన్ను గదమాయిస్తా రేమిటండీ' అని స్వగతం చేసుకుని, పక్కజేబులోంచి కవర్ను యిట్టే తీసేసి, సుందర్రావు చేతిలో పెట్టాడు.

మొహం చిట చిటలాడిస్తూ, ఆనందం వైపు ఎగాదిగా చూస్తూ, కవరును బర్రున చించేసి, లోపల కాగితాన్ని చిర్రునలాగేసి, కళ్ళు చిన్నవి చేసుకుంటూ, అప్పుడప్పుడు కళ్ళజోడు కళ్ళమీద నుంచి లాగేసి, నుదురు మీద పెట్టేసి, గబ గబ చదివేస్తున్నాడు.

'ఆ! ఆ! ....' అని సుందర్రావు అనుకుంటుంటే, ఊఁ .... ఊఁ అని ఆనందదానికి మూలుగు ప్రారంభం అయింది.

'అరి పిడుగా! నువ్వటోయ్!' అని సుందర్రావు అనేసరికి ఆనందం హడలి పోయాడు. ఆ ధ్వనికి, అతని చెవులు గింగురుమన్నాయి.

ఇందాక కుక్క ప్రాణాలు తీసేటంత పనిచేసించి, ఇప్పుడు నిజంగా యీ యన ప్రాణాలు తియ్యనే తీశాడు. అని ఆనందం దద్దరిల్లిపోయి, 'ఆ౯... నేనే ....' 'నేనే నండీ'...అన్నాడు పెద్దగా ఆయాసపడుతూ.

సుందర్రావు పెద్ద పెట్టున నవ్వాడు. ఆనందం కూడా అట్లాగేనవ్వా లను కున్నాడు.కాని వెకిలిగా వుంటుందేమోనని కొంచెం మెల్లిగా నవ్వుతూ, 'మొన్నే ప్యాసయ్యాను...అంటూ ఏదో చెప్పబోతుంటే. 'అంతా రాశాడుగా ... అమ్మాయ్ మనింటి కెవరొచ్చారో కనుక్కో' అన్నాడు, కూతురిని పిలుస్తూ. సమాధానం కూడా ఆయనే చెప్పుకున్నాడు. 'నీకు తెలీదులే, నా స్నేహితుడు నాచిన్ననాటి స్నేహితుడు అతని సన్ వచ్చాడు. ఐ యామ్ వెరీ హాపీ ... కూర్చోవోయ్, ప్లీజ్ సిడౌన్ అసలు మీ ఫాదర్‌కీ నాకూ యెన్నేళ్ల నుంచి పరిచయమో తెలుసా, తెలుసా అంట! యు డోంట్ నో ... మా పెద్దమ్మాయి లేదూ. అరుణ .... నీకు అరుణ సంగతి కూడా తెలీదుగా ... అమ్మాయి ... చలమయ్యా ఎక్కడ చచ్చాడు' అంటుండ గానే, చలమయ్య ట్రేలో రెండు కాఫీ కప్పులు తీసుకువచ్చి యిచ్చాడు.

'మా చలమయ్య చాలా మంచివాడు ... సుందర్రావు ఓ కప్పును, ఆనందానికి అందిచ్చాడు.

'అవునయ్యా ....' అంటూ చలమయ్య తలవూపాడు.

'అవునుగాని, సర్వేశ్వరర్రావు సంగతి యెప్పుడైనా. చెప్పావనీకు, చెప్పలేదు. నాకు తెలుసు, ఆయన నాబాల్య స్నేహితుడోయ్, చిన్నప్పుడు మేమిద్దరం గోలీలు ఆడుకునే వాళ్ళం ...'

'మీరు గోలీలు ఆడటమేటండీ' చలమయ్య పకాలున నవ్వాడు.

సుందర్రావు కోపంగా యిట్టే చూడగానే, చలమయ్య బిత్తరుపోయి,

చప్పున పెదిమలు బిగించేశాడు.

'మీ రెంత మంది అన్న దమ్ములు, అప్ప చెల్లెళ్ళూ ... అవును గాని ... నువ్వేం భయపడవద్దు' నీకు ఉద్యోగం యేదో ఒకటి యిప్పి చ్చేస్తాను. తెలిసిందా, ఏమంటున్నాను .... అర్థం అయిందా ...' సుంద్రరావు లేచి నిలబడ్డాడు.

ఆనందం కూడా నిటారుగా నిలబడ్డాడు.

'నువ్వు కూర్చోవోయ్ నువ్వు లేవటమేంటి... ఒరేయ్ చలమయ్యా మనగెస్ట్ రూముంది గదా, ఏది అదే ముందు గదోయ్. ఆనందం! .... ఏమిటి ఆనందం 'పేరు బాగాలేదోయ్, ఆనందం యేమిటి నామొహం. ఆడ అయింది తెలీదు మగ అయింది తెలీదు, ఆనందరావు అంటాను. నువ్వేమీ అనుకోవుగదా, నీ పేరు ఉంచాగదా ... ఇప్పుడు ఏమిటీ చెబుతున్నాను' ...ఊఁ ... నువ్వు ఆ గదిలో వుండిపో ....అంటే యిక్కడే నీ మకాం. సుంద్రరావు చర చరా లోపలికి వెళ్ళి పోయాడు.

ఆనందం సూట్ కేసు చేతిలోకి తీసుకోగానే, బెడ్డింగు చలమయ్య నెత్తిన పెట్టుకున్నాడు. ఒక అడుగు ముందుకు వేశాడో లేదో, కుక్క రివ్వును వచ్చేసింది. ఆనందం సూట్ కేసు చేతిలోంచి జారి, అతని కాలి చిటికిన వేలుమీద పడి, ఆనందాన్ని చిందులు తొక్కించింది.

చలమయ్యా అదేమాట ... 'జాకీ.... ఏమి చెయ్యదండీ...'

ఇంకేం చెయ్యాలంటావ్...ఇప్పుడు చేసింది చాలదూ అని ఆనందం భావం అయితే పైకి మాత్రం, అవును ఆ కుక్క యేమీచెయ్యదు, అని నిఖచ్చిగా అనెయ్యాల్సిందే! తీరా రూములోకి వెళ్ళేటప్పటికి, చిటికినవేలు పొడుగు బాగానే తగ్గిపోయింది. మళ్ళీ గుమ్మం ముందు కుక్క తయారు.

'అయ్యగార్ని అడిగి మందు తీసుకొస్తా' అంటూ చలమయ్య

వెనక్కి తిరిగేటప్పటికి చలమయ్య చేతిని గట్టిగా పట్టుకుని, 'యిదిగో యిది 'ఫస్టుఎయిడ్ బాక్స్' సూట్‌కేసుగాదు. ఇది మందుల పెట్టె తెలిసిందా, నేను వేసుకుంటాగాని, నువ్వు యెవ్వరితోను యేమీ చెప్పొద్దు.నువ్వు యీ కుక్కను మాత్రం నీతో తీసుకు వెళ్ళుదూ ....' అన్నాడు ఆనందం కాలి చిటికిన వేలును గట్టిగా చేతిబొటనవేలుతో రుద్దుతూ.

'ఈ కొత్తయ్యగారికి కుక్కంటే తెగని భయం ...' అనుకుంటూ జాకీని వెంట పెట్టుకుని లోపలికి వెళ్ళి పోయాడు చలమయ్య.

ఈ రోజుకు గండం గడిచి బైట పడ్డట్టే. తృప్తిగా ఆ రాత్రంతా నిద్రతో గడిపేశాడు. ఏ కలా రాలేదు.

భళ్ళున తెల్లారేటప్పటికి ఆనందం కంటికి ఎదురుగా కుక్క కనిపించింది. కళ్ళుతుడుచుకొని కళ్ళార్పుతూ, తేరపార చూశాడు. ఛీ కుక్క కాదు. అది కేవలం తన భ్రమే అయినా ఏమిటా భయం, ఓ మూల అందరూ కూడా 'జాకీ యేం చెయ్యదు' అంటుంటే కూడా అనుకున్నాడు.

వసతి బాగానే వుంది. ఉద్యోగ ప్రయత్నానికి వచ్చిన వాడికి యీ మాత్రం అండ దొరకటం, అందులో యీ మహా పట్నంలో ... గొప్ప జాతకమే. అసలు అయినా నీలకంఠ సోమయాజులు చెప్పనే చెప్పాడు గద. బుధమహా దశ నడుస్తోందని. బాగానే వుంది అని తనలో తాను ఎన్నెన్నో ఊహించుకుంటూ మురిసిపోతున్నాడు.

తెల్లవారటం ఆలస్యం, చలమయ్య కాఫీకప్పుతో హాజరవుతాడు. షేవింగు పూర్తికాక మునుపే, "నీళ్ళు తోడా నయ్యగారు" అనేవాడల్లా "నీళ్ళు చల్లారి పోతున్నాయి" దాక అనేసి గిర్రున తిరిగి వెళ్ళిపోతున్నాడు చలమయ్య. రోజు రోజుకీ మార్పును చూపిస్తూ ఏమిటి వీడి ధీమా నా పనయ్యేదాక ఆగలేదు, ఆనందం గట్టిగానే మందలిద్దామని అనుకున్నాడు.

'ఏంటి, యిక్కడ నీకేమీ యిబ్బం దేమీలేదుగా, వేళకు అన్నీ వస్తున్నాయా? ఇదిగో నువ్వేమి మొహమాట పడవద్దు. తెలిసిందా! నాకు లక్షాతొంభై పన్లుంటాయి ... ఓ చలమయ్యా; ... యీ అబ్బాయికి అన్నీ చూస్తున్నావా ... ఓ ఆనందరావు, నీకేదైనా కావాలసివస్తే, నన్న డిగేవోయ్ డైరెక్టగా — నీ ఉద్యోగం సంగతంటావా చూస్తూన్నా, వచ్చే స్తుందిలే. ఇవ్వాళ కాకపోతే నాలుగు రోజులు ఆలస్యం అయినా, నీకు మించిపోయిందేమిటి? ... ఏమిటి? ఏమిటో చెప్పబోతున్నావ్ చెప్పేసెయ్యి ...' సుందర్రావు రెండుచేతులు వెనక్కు పెట్టేసి, ఆనందం మొహంలోకి చూస్తూ నిలబడ్డాడు.

"నేను చాలా మొహమాటస్థుణ్ణని, చెప్పకోవటానికి నాకు నిజానికి భిడియంగానే వుంది, మీరు నన్ను ఆదరించి, ఎంతో సహాయపడు తున్నారు. ఎన్నాళ్ళని యిక్కడ వుండటం అనేది మీరు కూడా ఆలోచిం చాల్సిన విషయమే. అన్నీ తెలిసిన వారి ముందు నేను ఏం చెప్పినా వెలితిగానే వుంటుంది. నన్ను మొహమాటస్థున్నిగా, వుంటానికి మీరు గూడా సహాయ పడాలి. ఉద్యోగ విషయం మీరు ప్రయత్నం చెయ్యటం లేదనటం సాహ సమే అవుతుందని నాకు తెలుసు. అయితే ఉన్న పనుల వత్తిళ్ళలో యీ నా చిన్నా విషయం, మీకు పదే పదే గుర్తుకు రాకపోవచ్చని మాత్రం నేను భావించటంలో తప్పేమీ లేదనుకుంటాను. మీ అంతవారు నాకు అండగా వుంటుంటే, నాకు వచ్చిన లోపము యేమీ లేదుగాని, నా స్వశక్తి మీద నేను వుండగలుగు తున్నాను, అనే ఆత్మ విశ్వాసం, నాకు కలుగచెయ్య మని మాత్రం మిమ్మల్ని చాలా చాలా రిక్వెస్ట్ చేస్తున్నాను ..." చాలా నింపాదిగా, నిదానంగా మాటలు కామా, ఫుల్ స్టాపుల దగ్గర, ఆపి ఆపి ఆనందం సుంద్రరావు మొహంలోకి ఆశగా చూశాడు.

సుందర్రావు ఒక్కక్షణం బిత్తరు పోయి, అట్లాగే నిలబడి

పోయాడు.

"నువ్వు చాలా కాలాంతకుడివి. నా సర్వేశ్వర్రావును మరిపించావోయ్. ఎంత చక్కగా మాట్లాడావ్. చిన్నప్పుడు మీనాన్నగూడా యింతే! — నీ భావం నాకు అర్థమయింది. నేను చూస్తాగాని, ఆ విషయమేమిటో మళ్ళా ఉద్యోగ విషయం మాత్రం నాకు గుర్తుకు తెచ్చి నన్ను అవమానించవద్దు ..." సుందర్రావు వెనక్కి తిరిగాడు.

"క్షమించాలి... అవమానం యేమిటి." అని ఆనందం అంటుండగానే, సుందర్రావు లోపలికి వెళ్ళనే వెళ్ళాడు.

'ఏం చలమయ్యా, ఏంటి యివ్వాళ హుషారుగా వున్నావ్ ...' ఆనందం రెండుచేతులను, పాంట్ జేబుల్లోకి పోనిచ్చి, తలయెగరేస్తున్నాడు. ఏమిటి విశేషం అన్నట్లు.

'ఏంలేదండి చిన్నమ్మగార్ని చూట్టానికి వస్తారండి యివ్వాళ' — చలమయ్య నవ్వుతూ అన్నాడు.

'అట్టాగా, అవుతే నే ముందరగానే తప్పుకుంటే మంచిది' చివాలున లేచినిలబడ్డాడు.

'అయ్యగారు, చిన్నయ్యగారు, మీరు తప్పక యీడనే వుండాలి. పెద్దయ్య గార్కి అండగా ఉంటుంది. పాపం చిన్నమ్మాయిగారి పెళ్లికోసమని, దిగులు పడిపోతున్నారంటే నమ్మండి. అమ్మగారవుతే పైకి అట్టా వుంటున్నారుగాని ... అబ్బబ్బ తలచుకుంటే భయమేస్తుంది ...' కళ్ళు అద్దుకున్నాడు చలమయ్య.

కాసేపు బిత్తర పోయాడు ఆనందం.

'ఏమిటి యింత చేటుగా బాధపడు తున్నావు ... చలమయ్యా, ఏదీ నావంక చూడు...'

'చిన్నయ్యగారు ... నే నోమాట చెపుతా, మళ్ళీ యెక్కడా అన కండీ ...'

'చెప్పవోయ్ ఏమిటా సస్పెన్స్! ....' అసహనాన్ని తీవ్రంగా ప్రదర్శించాడు ఆనందం.

'ఎన్ని సంబంధాలు వచ్చినా కూడా ఒక్కటీ కుదరటం లేదండీ. అయ్యగారి హోదాచూసి బోలెడంత డబ్బు అడుగు తున్నారండి ... మన లోమాట నేను చెప్ప కూడదనుకోండి .... అయ్యగారు గొప్పలకు పోతా రండి. దాంతోనే చిక్కొచ్చి పడుతుంది. అందరూ కూడా, అయ్యగారి దగ్గర యెంతో డబ్బుందని అనుకుంటారండి ... నిజం నాకు తెలుసు గదండీ ... ఇంకా మీకు తెలీదుగాని, పెద్దబ్బాయిగారే అసలు అయ్యగారి మనస్సు పాడు చేసింది. అదొక పెద్దకథ ... ...'

'ఆపాపు, అసలు నాదే ఓ కథ. అందులో మళ్ళీ యింకో కథలో నిండా మునిగివున్నాం. మూడోకథ కూడానా ... ఆపేసెయ్యి — నేనిక్కడికి వచ్చింది ఉద్యోగం కోసం. నాకింకా వేరే వ్యాపకాలు యేంలేవు. తెలిసిందా. ఇప్పుడే అర్జంటుగా వెళ్ళి ఒకాయన్ను కలవాలి ... నేవెళు తున్నాగాని ... నువ్వు జాగ్రత్త.' నవ్వుకుంటూ గడపదాటాడు ఆనందం.

రాత్రి చాలా పొద్దుపోయింది. ఆనందం దిగాలుపడి నుదురు మీద అర చెయ్యిని ఆనిచ్చి, చాలా ఆందోళన పడుతున్నాడు. 'ఎన్ని చోట్లకని వెళ్ళినా, అంతా చుక్కెదురే? ఇంటర్వ్యూలో ఫెయిల్ అవడానికి కారణం యేమీలేదే! వాళ్ళువేసిన తప్పుడు ప్రశ్నలన్నింటికీ సూటిగా సమాధానం చెప్పానే! అసలు సూటి సమాధానాలు చెప్పటమే తప్పేమో ఇన్నేళ్ళు కష్ట పడి చదివిన చదువునంతా, ఎవడో నాలుగు ప్రశ్నలువేసి, ఇట్టే తీసి పారే స్తాడా! మన తెలివి తేటలు ఆ చవట బుర్రలకు అర్థం కాలేదనుకుంటే

తృప్తిగా వుంటుందా, ఆ మేధావుల ముందర ఈ మట్టి బుర్ర పనికిరాదను కుంటే సరిపోతుందా ! అని ఆలోచనలను రాచిరంపాన పెడుతున్నాడు. అందరూ తలోమాట. ఏది నమ్మేటట్టు ! నమ్మక చేసేదిదేమిటి ! ఒక బ్యాంకులో గుమాస్తా ఉద్యోగానికి అయిదు వేలు లంచం యివ్వాలంటే, నమ్మటానికి వీల్లేకండానే వుంది. ఓ వేళ నిజమని రుజువయినా, అంత డబ్బేది! అన్నట్టు జేబులు ఖాళీఅయినాయిగ మళ్లీ మనిఆర్డర్ వచ్చేదాకా,ఇల్లు కదిలేపనే లేదు. సుందర్రావుగారు, సుందర్రావుగారు అని ఒకటే స్మరణ, ఆయనదిగ్గ రకువెళ్ళటం ఆలస్యం, అపాయిట్‌మెంట్ఆర్డర్, జేబులోంచితీసి, అమాంతం చేతిలో పెట్టేస్తాడనుకున్నాడు మానాన్న, పిచ్చినాన్న! మనసహనం పరీక్ష చేయటం ఒకందుకు మంచిదేగాని, నాన్నను మాటమాటకు డబ్బు పంపించ మని రాయటానికి మనసొప్పటంలేదే ! మిస్టర్ లూథర్ యిచ్చిన రికమెం డేషన్ లెటర్‌ను మహమ్మదాలీ గారికి చూపిస్తే, ఆయన యాదగిరిగార్కి ఫోన్‌చేసి చెపుతాడు. ఆ 'నరసింహస్వామి' కటాక్షించి ఇంటర్వ్యూ బోర్డు మెంబరు చెవులో ఊదితే, నన్ను అట్టే విసిగించే ప్రశ్నలు యేవీ వెయ్యక 'నీ పేరేటి ? నువ్వేం చదువుకున్నావు' అనే రెండు జటిల ప్రశ్నల్ని ఝళిపించి, నన్ను సెలెక్టుచేశారు. ఆహా ! ఎంత చక్కగా వుంది. ఎడ్మిని స్ట్రేషన్ ? వీళ్ళందర్నీ ఓసారి నేను చుట్టుముట్టి రావాలి ! చంపాడు ఫో ! ఇల్లు కదలటం యెట్లాగా అని. నేను ఉక్కిరిబిక్కిరవు తుంటే. వీళ్ళందర్నీ కలవాలంటే అయిందన్నమాటే, మనపని. ఇది అయ్యేది కాదు పెట్టేదికాదు, పదిరూపాయల కోసం పరువు పోగొట్టుకుని 'దేహి' అని చెయ్యి జాచేదాని కంటే చప్పగా ముసుగు పెట్టుకుని పడుకుంటే మంచిది. ఇలాంటి ఇంట ర్వ్యూలు ఎన్ని తప్పినాయి, యింకా యెన్నింటికి హాజరు కావలసివస్తుందో, అప్పుడే యేమయింది ! ఇన్‌సల్ట్. యం. ఏ. ప్యాసయి, మామూలు గుమాస్తాకోసం, యస్. యస్. సి. వాళ్ళతోపాటు, అంతసేపు అ గేటు

ముందర పడిగాపులు కాస్తున్నాడంటే, నిరుద్యోగ సమస్య యెంతతీవ్రంగా వుందో యింకా చెప్పాలా! ఏమయినా యింకోళ్ళ సంగతి మనకెందుకు, యీ సుందర్రావు గారి పలుకుబడేమిటో యీ దెబ్బతో తేల్చేస్తా!' తనలో తాను రకరకాల ఊహించుకుంటూ శరీరాన్ని పెంచుకున్నాడు, అనంద రావు!

చలమయ్య కాఫీ కప్పు గదిలోకి తీసుకు వచ్చాడు. ఆనందం గమ నించలేదు. 'చిన్నయ్యగారు' అనేపిలుపు ఆయనకు వినబడలేదు. నిజంగానే నిండా ముసుగుపెట్టి పడుకున్నాడు, ఆనందం. దుప్పటి దట్టంగా వుండటం వలన, సూర్యకిరణాలు సూటిగా వచ్చేసి, మధ్యలో ఆగిపోయినాయి.

సుందర్రావు పైకి డాంబికంగా కనిపించినా, మనస్సు విలవిలలాడు తూనేవుంది. ఒమూల కూతురి పెళ్ళి సమస్య కలవరపెడుతోంది. ఇంకొక వైపు సర్వేశ్వర్రావు గారబ్బాయి ఉద్యోగం కోసం వచ్చి, గుండెలమీద నాట్యంచేస్తున్నాడు. మళ్ళీ ఆ ఉత్తరం చదువుతుంటే, సుందర్రావు వళ్ళు ఝల్లుమంటోంది ... 'ఈ బీద పాతస్నేహితుణ్ని మరవవని, మా అబ్బా యికి తప్పక ఏదో ఉద్యోగం యిప్పిస్తావని, గంపెడాశతో నీ దగ్గరకు పంపుతున్నాను. నువ్వు తలుచుకుంటే యిదొక పెద్ద విషయంకాదని, నాకు తెలుసు. పెద్దకుటుంబీకుణ్ని, యిక్కడ మేము యేవిధంగా గడుపు తున్నామో, నేను ప్రత్యేకించి రాయటం అనవసరం.'

'పాపం! నామీద యెంతో ఆశపెట్టుకుని పంపిచాడు. ఎంత ప్రయ త్నంచేసినా కుదరటంలేదే. ఆనందం నన్నుగురించి యేమనుకుంటున్నాడో యేమొ!' అనుకుంటూ సుందర్రావు, అనందంగది వైపుకు నడిచాడు.

'చలమయ్యా ...!'

'అవునయ్యా, పొద్దుగాల నుంచి, చిన్నయ్యగారు లేవలేదండీ ...'

ఈ మాటలు కాస్త ఆనందం చెవిదాకారాగానే, అమాంతం ముసుగు తీయగానే, యెదురుగా, సుందర్రావు సాక్షాత్కార మయ్యాడు. మళ్ళా ముసుగు వేసుకోవటానికి మనసొప్పటం లేదు. చప్పున లేవటానికా, వెనకాడుతున్నాడు.

'ఏమిటి ఆనందరావు, యింకా పడుకునే వున్నావ్' జాలిగా, ఆప్యాయంగా కరుణగా, సుందర్రావు. నోటి నుంచి వినటం, ఆనందంకు యిదే మొదటిసారి.

'అబ్బేయేంలేదండీ ... వంట్లో బాగాలేదు'

వద్దని అనుకుంటూనే, అనుకుంటూనే అనేశాడు ఆనందం. చప్పున నాలుక కరుచుకున్నాడు.

'ఏమిటి, ఫీవరా! ... చలమయ్యా, ... డాక్టరు నిత్యానందానికి ఫోన్ చెయ్యి. నే మాట్లాడతాను ..."

'జ్వరం కాదండీ....'

'మరి...'

'వంట్లో బాగాలేదని అబద్ధమాడితే, తప్పక డాక్టరుచేత యే ఇంజక్షనో పొడిపించటం ఖాయము. గిర్రున ప్రదక్షిణాలు చెయ్యాలసిన వాన్ని చప్పగా గదిలో ముసుగు పెట్టుకు పడుకోపటానికి గల కారణాలు యే రకంగా చెపుతే, సుందర్రావు నిజంగా బోల్తాపడతాడు అని యెంత ఆలోచించినా బుర్రకు తట్టటం లేదు. డబ్బులు లేవు అందుకనే యింట్లో వుండి పోయాననే నిజాన్ని, చస్తే చెప్పకూడదని నిర్ణయించుకుని, బద్ధకంగా లేచి నిలబడి, ఆవలించి, 'యివ్వాళ యెవ్వర్నీ కలవాల్సింది లేదండి అందుకనే ...' అంటూ సుందర్రావు మొహం లోకిచూసి చప్పున ఆపేశాడు ఆనందం.

సుందర్రావు, నిబ్బరంగా, బింకంగా, కళ్ళార్పకండా చూస్తూ, కళ్లల్లో సుడులు తిరుగుతున్న వాటిని కిందపడకండా విశ్వప్రయత్నం జేస్తున్నాడు.

'ఆనందరావ్ ! ఐయామ్ సో సారీ ! ... నీమీద పూర్తిగా సింపథీస్ వున్నాయి, కాని, యింకా కొంత టైము పడుతుందనుకుంటాను. నువ్వు డిస్పైర్ కావద్దు. ఉద్యోగం రాందే మాత్రం నువ్వు యింటికి వెళ్ళవు. నేను వెళ్ళనీను ...' కొంచెం ఉద్రేకంగా మాట్లాడాడు సుందర్రావు. క్షణంలో గిర్రున తిరిగి వెళ్ళిపోయాడు.

ఆనందానికి పూర్తిగా అర్థమయి పోయింది. తన అసమర్థత, అశక్తత సుందర్రావు పూర్తిగా గ్రహించాడని తెలుసుకున్నాడు. తనమీద సానుభూతి చూపటానికి, సుందర్రావు చేసిన ప్రయత్నం అనందానికి ఎబ్బెట్టుగా వుంది. తనమీద సానుభూతి చూపించే యే వ్యక్తినైనా సరే, ఆనందం, సహించలేడు తన వ్యక్తిత్వానికి, ఆత్మాభిమానానికి పెద్ద దెబ్బ, అని అవమానంతో ఆ క్షణంలో కుంగిపోయాడు. ఏం చెయ్యాలో తోచక, అక్కసుగా దుప్పటిని విదిలించి అవతల పారేశాడు.

'వేన్నీళ్ళు పెట్టానండీ....' అంటూ మామూలుగానే చలమయ్య వచ్చి చెప్పాడు.

ఇప్పుడున్న మంటకు చన్నీళ్ళే మంచిదిలే అనుకుంటూ, యీసారి మళ్ళీ వేన్నీళ్ళు పెట్టానండి అని మాత్రం అనక అంటూ హెచ్చరించాడు.

బైటకు వెళ్ళడానికా వీల్లేని పరిస్థితి, యింట్లో వుండడానికా మనసొప్పటం లేదు. చిర్రుబుర్రులాడిపోతున్నాడు. కుక్క రెండు మూడు సార్లు తొంగిచూసి పోతోంది. ఆనందం, మహాకోపంగా, చూపుడు వేలుతో,

'గెటిన్, డోంట్ డిస్టర్బ్' అని కుక్కతో మనిషిని గదమాయించినట్లు గదమాయించాడు. కుక్క చెవులనుకిందకుదించేసి, తోకను జారేస్తూ, ముడుచుకుని, మెల్లిగా లోపలికివెళ్ళిపోయింది.

'చిన్నయ్యగార్కి యెంత ధైర్యం వచ్చింది' అని లోపల లోపల సంతోష పడ్డాడు చలమయ్య.

చలమయ్య మొహంలో మార్పును, ఆనందం, ఓ కంట కని పెట్టాడు. ఆనందం,ధోరణిలో అదోలాగ వచ్చిన మార్పును కనిపెట్టి, మెదలకండా, కాఫీయిచ్చి, చక్కాపోయాడు. మధ్యాహ్నం పోస్ట్‌మన్‌వచ్చి వెళ్ళి పోయాడే కాని, మనిఆర్డర్ మాత్రం రాలేదు. ఆనందానికి వెర్రెత్తి పోతోంది. చలమయ్య రెండు మూడుసార్లు ఆనందం రూమువైపుకు వచ్చి తొంగి చూసిపోతున్నాడు. ఆనందం చూసీ చూడనట్టుగా వూరు కున్నాడు. చలమయ్య మనస్సాగటంలేదు. సరాసరి లోపలికి వచ్చేసి రెండుచేతులు కట్టుకుని నిలబడ్డాడు. వెనకాలే కుక్క కూడా తోకాడించు కుంటూ వచ్చి నిలబడింది.

'చిన్నయ్యగారు,మీరు కోప్పడకండావుంటే,ఓ మాట చెపుతాను...' మొహం యింత చేసుకున్నాడు చలమయ్య.

'చలమయ్యా, నీ మీద నాకు కోపం ఏమిటి చెప్పు...నేనా ఉద్యో గానికి వచ్చినవాణ్ణి, నామీద అందురూ సానుభూతి చూపించాల్సిందే. నువ్వు కూడా ఏదైనా అనచ్చు. తప్పేంలేదు. నన్ను ఎగతాళి చేస్తున్నా వని మాత్రం నేననుకోన్లే. నువ్వు కూడా రెండు కన్నీటి బిందువులు రాల్చు ...' ఆనందం, నిదానంగా, వ్యంగ్యంగాను అన్నాడు.

'బాబ్బాబు...అంతమాట అనకండి... పెద్దయ్యగారి మనస్సు మీకు తెలీదు...కుమిలిపోతున్నారంటే నమ్మండి ... ఇప్పటికి పన్నెండుగురు

పెళ్ళికొడుకులువచ్చి చూసిపోయారు, చిన్నమ్మాయిగార్ని. ఆ అమ్మాయి గారు యెంతగా బాధపడుతోందో మీకు తెలీదు, పైకి చెప్పలేక లోపల అణచుకోలేక, అవమానంతో కుంగి పోతోంది. మొన్న వచ్చిన వారు పదివేలు కట్నం అడిగారు. పెద్దయ్యగారి దగ్గర పదివేలుకాదుగదా, పదివందలు కూడా లేవండి ... ఎట్టా పెళ్ళిచేస్తారో యేమొ! దిగులుపడి పోతున్నారు...మీరు తలుచుకుంటే...' చప్పున ఆపేశాడు చలమయ్య.

పరధ్యానంగా వింటున్న ఆనందం ఒక్కసారి త్రుళ్ళిపడ్డాడు. 'ఏమిటి పదివేలా...నేను తలుచుకుంటేనా ! నీకేమైనా మతిపోయిందా... అంత డబ్బు నా దగ్గరవుంటే యీ ఉద్యోగంకోసం దేబిరింపు దేనికి' అని మనస్సులో అనుకుని, చప్పున మొహం వెడల్పుచేసుకుని, 'పెద్దయ్య గారున్నారాయింట్లో' అన్నాడు ఆనందం,చివాలున లేచినిలబడి.

'గదిలో ఒంటరిగానే కూచున్నారండీ ! ...' అని చలమయ్య అటుండగానే, గభాలున, చలమయ్యను, కుక్క మీదకు నెట్టినట్టుతోసేసి, సుందర్రావుగారి గది దగ్గరకు వెళ్ళాడు.

'మే ఐ కమిన్!'—స్టైల్‌గా ఆనందం, తలుపు దగ్గర నిలబడ్డాడు.

'ఆఁ !' అంటూ తలపైకికెత్తి చూశాడు.

'నువ్వటోయ్ ఆనందం' అని మనస్సులో అనుకుని 'రా' అంటూ సన్నగా, నీరసంగా అన్నాడు, సుందర్రావు!

'నేను మీ యింటికి వచ్చింది కేవలం ఉద్యోగం కోసమే అని మీరు అనుకుంటే, చాలా పొరబడిన వారవుతారు. నాకు ఆత్మాభిమానం, అన్నిటి కంటె విలివైనది, ప్రియమైనది అని అదివరకే మనవి చేసుకున్నాను. నన్నుచూసి జాలిపడటం, నా మీద సానుభూతి ప్రదర్శించటం, నేను ఊహించలేని విషయాలు. అసలు, అవి నాకు గిట్టవు. ఇన్నాళ్ళబట్టీ

మీ యింట్లోవుంటూ, మీ విషయాలు యేవీ నేను తెలుసుకోలేదని, మీరు అనుకోరని నాపూర్తి విశ్వాసం.మీకు యేవిధంగా నేను, సహాయపడగలనో అనేదే, నాఆవేదన. మీరు కూడా నా మీద అంత ఆప్యాయత, గౌరవం చూపెడుతునే వచ్చారు. ముందు వెనకలు, అంతే. మీ మానసిక ఆందోళనను నా శాయశక్తులా తగ్గించటానికి, నిశ్చయం చేసుకున్నాను ...' ఇంకా అనందం చెప్ప బోతూండగా, సుందర్రావు కుర్చీలోంచి మెల్లిగా తూలుతూ లేస్తూ, 'ఏమిటి?...అన్నాడు.

'మీ అమ్మాయిని, నేను పెళ్ళిచేసుకుంటాను' ....ఆనందం, సుందర్రావు మొహంలోకి నిశ్చలంగా చూశాడు.

'నేను చెప్పబోయేది అదేనండి...' సంతోషంతో ఊగిపోయాడు చలమయ్య.

కుక్క భవ్ భవ్ మంటూ గభాలున వసంత దగ్గరకువెళ్ళి, చీరె కొంగుపట్టుకుని లాగుతోంది.

'నువ్వు నా సహాయంకోరి నా దగ్గరకువచ్చి,నాకే...' సుందర్రావు గొంతులో జీరవచ్చింది అమాంతం,ఆనందాన్ని కౌగలించుకుని,"అమ్మాయి వసంతా" అంటూ బిగ్గరగా కేక పెట్టాడు.

****